
సాక్షి విశాఖపట్నం

బుధవారం । 15 । మార్చి । 2023



ట్రాఫిక్ ఉల్లంఘనపై ఫైన్

ఎన్‌హెచ్‌ఆర్సీ రాష్ట్ర కార్యదర్శికి మోటారు వాహనాల చట్టం ప్రకారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. 10లో



జలసవ్వడి

జీవీఎంసీ పరిధిలో ఈ వేసవిలో కూడా నీటి సరఫరాకు ఢోకా లేదు. రిజర్వాయర్లలో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయి. 10లో



ఉపకరణాల పంపిణీ

రాజస్థాన్ సాంస్కృతిక మండల్ భవన్‌లో విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్స్, వాకర్స్, స్టిక్స్, ఊత కర్రలు పంపిణీ చేశారు. 10లో

న్యూస్‌రీల్

ఎయిర్‌పోర్టులో సెల్ఫ్ చెక్-ఇన్ కియోస్క్‌లు!



ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన కియోస్కు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో సెల్ఫ్ చెక్-ఇన్ కియోస్కులు ఏర్పాటయ్యాయి. వీటిని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికులు విమానాశ్రయంలోకి ప్రవేశించే డిపాచర్ గేట్ల సమీపంలో రెండు సెల్ఫ్ చెక్-ఇన్ కియోస్కులను ప్రారంభించింది. ఇప్పటికే ఇలాంటివి రెండు కియోస్కులు ప్రీ-చెక్-ఇన్, చెక్-ఇన్ ఏరియాల్లో ఉన్నాయి. ఇప్పుడు తాజాగా అందుబాటులోకి తెచ్చిన సెల్ఫ్ చెక్-ఇన్ కియోస్కుల వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లే విమాన ప్రయాణికుల తనిఖీ ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

విశాఖలో ఎన్‌డీసీ బృందం



జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : 18 మంది సభ్యులతో కూడిన నేషనల్ డిఫెన్స్ కాలేజీ(ఎన్‌డీసీ) బృందం విశాఖ చేరుకుంది. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబులతో బృంద సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను అధ్యయనం చేసేందుకు బృందం విశాఖ చేరడం అభినందనీయమన్నారు. రాష్ట్రం సాధించిన ప్రగతి, వివిధ రంగాల్లో అభివృద్ధిని బృంద సభ్యులకు కలెక్టర్ వివరించారు. విశాఖలో పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యటించాలని కలెక్టర్ ఆహ్వానించారు. అనంతరం బృందాన్ని కలెక్టర్ మల్లికార్జున సత్కరించారు.

పది పరీక్షలకు అబ్జర్వర్‌గా జ్యోతికుమారి



జ్యోతి కుమారి

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలకు సంబంధించి విశాఖ, అనకాపల్లి జిల్లాలకు అబ్జర్వర్‌గా విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారిని నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా జ్యోతి కుమారి రెండు జిల్లాల్లో ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు. సార్వత్రిక విద్య విధానంలో జరిగే పరీక్షలకు కూడా ఆమె అబ్జర్వర్‌గా వ్యవహరించనున్నారు.

ఫార్చ్యూన్ హిల్స్‌లో 9 మంది కేటాయింపులు రద్దు

దొండపర్తి: దాకమర్రి గ్రామంలో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ఫార్చ్యూన్ హిల్స్ లేఅవుట్‌లో 9 మంది ప్లాట్ల కేటాయింపులు రద్దు చేసినట్లు సంస్థ కార్యదర్శి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లేఅవుట్‌లో ఎల్‌ఐజీ ప్లాట్లకు ఈ ఏడాది జనవరి 7న లాటరీ పద్ధతిలో ప్లాట్లను కేటాయించారన్నారు. ఇందులో నలుగురు ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి చూపించలేదన్నారు. అలాగే మరో 5 మంది కేటాయించిన తరువాత నిర్దేశిత డబ్బును చెల్లించలేని పేర్కొన్నారు. దీంతో వీరి కేటాయింపులు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. వారి స్థానంలో లాటరీలో రిజర్వ్ వారికి త్వరలో కేటాయింపులు చేస్తామన్నారు.

నల్లకోటు ధరించడంలో సడలింపు

విశాఖ లీగల్: వేసవి దృష్ట్యా న్యాయవాదులకు నల్లకోటు ధరించడంలో స్వల్ప సడలింపు లభించింది. ఈ మేరకు రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో న్యాయవాదులు కోటు ధరించడంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిని పరిగణలోకి తీసుకుని ఈనెల 15వ తేదీ నుంచి జూలై 15 వరకు కోటు ధరించడంలో సడలింపు ఇచ్చారు. న్యాయవాదులు ప్రతిరోజు తెల్ల ప్యాంటు, నలుపు, గ్రే కలర్ ప్యాంట్‌లను ధరించవచ్చు. ఈ నియమాన్ని అన్ని దిగువ కోర్టులకు వర్తిస్తుందని కార్యదర్శి పేర్కొన్నారు.

హౌస్‌ఫుల్



ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద క్యూలో అభిమానులు

- హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన వన్డే మ్యాచ్ టికెట్లు
- ఎగబడ్డ అభిమానులు.. భారీగా క్యూలు

విశాఖ స్పోర్ట్స్: విశాఖకు క్రికెట్ ఫీవర్ వచ్చేసింది. భారత్-ఆస్ట్రేలియా సిరీస్‌లో భాగంగా ఈ నెల 19న వైఎస్సార్ ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో జరిగే డేనైట్ వన్డే మ్యాచ్‌ను ఎప్పుడు చూసేద్దామా అని అభిమానుల్లో ఆతృత నెలకొంది. ఈ మ్యాచ్ వీక్షించేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం ఇప్పటికే పూర్తి కాగా.. ఆఫ్‌లైన్‌లో మంగళవారం మూడు కౌంటర్ల ద్వారా విక్రయించారు. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్, వెలంపేటలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియానికి పిల్లలతో సైతం టికెట్ల కోసం క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. కొందరు యువతీయువకులు టికెట్ల కోసం బారికేడ్లు దూకేసి ఎగబడ్డారు. టికెట్లను పేటీఎం విక్రయించినా.. ఏర్పాట్లను మ్యాచ్ నిర్వాహక కమిటీ పర్యవేక్షించింది. టెంట్‌లతో పాటు మంచి నీటి సౌకర్యం, బారికేడ్లను ఏర్పాటు చేసింది. కనీస ధర నుంచి అన్ని డినామినేషన్లలోనూ గంటల వ్యవధిలోనే టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోవడంతో.. సోల్డ్ అవుట్ బోర్డులు వెలిశాయి. కాగా.. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన వారికి ఫిజికల్ టికెట్లుగా మార్చుకునే వెసులుబాటును కల్పించారు. 19వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. వైఎస్సార్ స్టేడియంలో గత జూన్‌లో టీ20 మ్యాచ్ జరగ్గా, 2019 చివర్లో వన్డే మ్యాచ్ జరిగింది. భారత్‌కు అచ్చొచ్చిన స్టేడియంగా పేరొందిన వైఎస్సార్ స్టేడియం మరోసారి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో 27 వేల మంది అభిమానులతో కిక్కిరిసిపోనుంది.

11.30 గంటల నుంచే స్టేడియంలోకి...

మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం రెండు గంటల ముందు నుంచే స్టేడియంలోకి ఆయా ప్రవేశ ద్వారాల నుంచి ప్రేక్షకులను అనుమతించనున్నారు. మూడున్నర తర్వాత స్టేడియంలోకి అనుమతించరు. టికెట్లను అధునాతన టెక్నాలజీతో స్కాన్ చేసి ఆయా గేట్ల ద్వారా లోపలకు అనుమతిస్తామని ఏసీఏ కార్యదర్శి గోపీనాథ రెడ్డి తెలిపారు. ప్రవేశద్వారాల వద్ద డిస్‌ప్లే బోర్డులతో పాటు ఈసారి పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ పర్యవేక్షిస్తున్నారు. స్టేడియంలో ఉచితంగానే మంచినీటిని అందించనుండగా... వైద్య, ఆహారపు స్టాళ్లు, పార్కింగ్ ఏర్పాట్లకు అనువుగా వైఎస్సార్ స్టేడియం మరోసారి ముస్తాబవుతోంది.



టికెట్ దొరికిందోచ్.

మ్యాచ్‌కు మూడంచెల భద్రత

దొండపర్తి: అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌కు మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ అధికారులను ఆదేశించారు. మ్యాచ్‌కు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సీపీ మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో సమీక్ష చేపట్టారు. మ్యాచ్ వీక్షించడానికి వచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టికెట్ ఉన్న ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా వారికి కేటాయించిన గేట్లలో అనుమతించాలన్నారు. ముఖ్యమైన పాయింట్లలో ఏసీపీ స్థాయి అధికారులను నియమిస్తున్నట్లు చెప్పారు. విధులు నిర్వర్తించే సిబ్బందికి సమయానికి ఆహారం అందించాలన్నారు. స్టేడియం చుట్టూ మూడంచెల భద్రతపై ప్రధానంగా అధికారులతో చర్చించారు.







టికెట్లు పొందిన ఉత్సాహంలో అభిమానులు, వైఎస్సార్ స్టేడియం వద్ద ఇండియా జెర్సీలు కొనుగోలు చేస్తున్న యువకులు

విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ ఫస్టియర్, రేపటి నుంచి సెకండియర్ పరీక్షలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 128 కేంద్రాలు
- హాజరు కానున్న 1,13,251 మంది విద్యార్థులు
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

హెల్ప్‌లైన్ నంబర్
0891-2567561



ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు గుర్తింపు కార్డులు ఇస్తున్న అధికారులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి, రెండో సంవత్సరం విద్యార్థులకు గురువారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 361 జూనియర్ కళాశాలల నుంచి జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి మొత్తం 1,13,251 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో బాలురు 55,960 మంది, బాలికలు 57,291 మంది ఉన్నారు. వీరి కోసమని 128 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆర్‌ఐవో కార్యాలయంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కేంద్రాల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లో వైద్య సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

ఆర్‌ఐవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్

పరీక్షల విషయంలో ఏదైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్ 0891-2567561కు ఫోన్ చేసి తెలపవచ్చు. విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. హాల్ టికెట్ చూపించి ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించరు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు, ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించరు.

ప్రత్యేక తనిఖీ బృందాలు

పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్ఐ, సీనియర్ లెక్చరర్‌తో కూడిన ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. 4 ఫ్లయింగ్ స్క్వాడ్, 5 సిటింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించనున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కేడీ పేట కేంద్రాన్ని అత్యంత సమస్యాత్మకంగా గుర్తించి, అక్కడ ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

జిల్లా	పరీక్ష కేంద్రాలు	ఫస్టియర్ విద్యార్థులు	సెకండియర్ విద్యార్థులు
విశాఖపట్నం	78	38,831	36,411
అనకాపల్లి	34	13,281	16,236
అల్లూరి	16	4,392	4,100
మొత్తం	128	56,504	56,747

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కేంద్రాల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాం. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి. విద్యార్థులకు ఆల్ ద బెస్ట్.

– పి.ఉమారాణి, ఆర్‌ఐవో

స్టేడియంలో విస్తృత తనిఖీలు

- రంగంలోకి కే9 స్నిఫర్ డాగ్స్, బాంబు తనిఖీ బృందాలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై కసరత్తు



వైఎస్సార్ స్టేడియంలో తనిఖీ చేస్తున్న కే9 స్నిఫర్ డాగ్స్ బృందం

దొండపర్తి: భారత్-ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19న జరగనున్న వన్డే మ్యాచ్‌కు పోలీస్ శాఖ గట్టి నిఘా పెట్టింది. అంతర్జాతీయ ఆటగాళ్లు, ఆట చూసేందుకు వచ్చే ప్రముఖులు, క్రికెట్ అభిమానుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. మ్యాచ్‌కు సమయం దగ్గరపడుతుండడంతో పోలీస్ శాఖ స్టేడియాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. ఇందులో భాగంగా మంగళవారం నుంచి మైదానం, పరిసర ప్రాంతాల్లోను విస్తృత తనిఖీలు ప్రారంభించింది. ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ తనిఖీల కోసం సీపీ శ్రీకాంత్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కే9 స్నిఫర్ డాగ్స్ బృందాన్ని స్టేడియంలో తనిఖీల కోసం రంగంలోకి దింపారు. అడ్వాన్స్ యాంటీ సాబోటేజ్ చెక్ టీమ్స్, బాంబు తనిఖీ బృందాలతో క్రికెట్ పిచ్‌తో పాటు స్టేడియంలో అణువణువూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. మైదానం లోపలే కాకుండా పార్కింగ్ ప్రదేశాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ స్టేడియాన్ని సందర్శించి నిఘా, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. డీసీపీ-1 సుమిత్ సునీల్ గరుడ్ స్టేడియం, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశాలపై కసరత్తు చేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా జీ-20 సమ్మిట్

- ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహణ
- కార్యక్రమ వివరాలు వెల్లడించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో సీపీ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

మహారాణిపేట: విశాఖలో మరో ప్రతిష్టాత్మక జీ-20 సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఏయూ కాన్వొకేషన్ హాలులో నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబుతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు జీ-20 సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ఈ నెల 27వ తేదీ నుంచి వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్ విశాఖ చేరుకుంటారని.. వారికి విశాఖ విమానాశ్రయంలో మన సంప్రదాయంతో స్వాగతం పలుకుతామన్నారు. 28న ప్రతినిధుల ప్రణాళికా చర్చలు, అదే రోజు రాత్రి అతిథులకు డిన్నర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని కలెక్టర్ వెల్లడించారు. 29వ తేదీ ఉదయం యోగా, మెడిటేషన్ అనంతరం ప్యానల్ చర్చ జరుగుతుందన్నారు. 30వ తేదీ ప్యానల్ చర్చ అనంతరం జీవీఎంసీ కమిషనర్ ఎంపిక చేసిన మూడు ప్రాంతాల్లో విదేశీ ప్రతినిధులు సందర్శిస్తారని చెప్పారు. 31వ తేదీ ఉదయం సిటీ ప్లానర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులతో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు 'జనభాగిదారి' కింద వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. 18వ తేదీ ఉదయం యోగా డ్రైవ్ ఉంటుందన్నారు. 19న ఆర్.కె.బీచ్ నుంచి 3కె, 5కె, 10కె మారథాన్ నిర్వహిస్తామని.. ఇందుకోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 22న మాక్ జీ-20 సదస్సు నిర్వహణ, 24న జీవీఎంసీ ఆధ్వర్యంలో సాగర తీర స్వచ్ఛత కార్యక్రమం, 25న ఫ్రీ ఆర్ట్ కాంటెస్ట్, 26న వైజాగ్ కార్నివాల్ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ జీ-20 సమ్మిట్ నేపథ్యంలో 2,350 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. విమానాశ్రయం, డెలిగేట్స్ బస చేసే హోటళ్లు, వారు సందర్శించే ప్రాంతాల్లో గట్టి భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించామన్నారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నాటికి నగర సుందరీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. సుమారు రూ.100 కోట్లతో పనులు జరుగుతున్నాయని.. అదనంగా బీచ్ పార్కుల అభివృద్ధి, రోడ్లు వేయడం, మొక్కలు నాటడం తదితర పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు వెల్లడించారు. అనంతరం జీ-20 సమ్మిట్‌కు సంబంధించి టీ షర్టులను విడుదల చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులతో సమావేశం

అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన కలెక్టర్

సీతంపేట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. మంగళవారం ఉదయం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్‌జైన్ సమక్షంలో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరు జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు కృషిచేసిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్‌జైన్ సమక్షంలో ర్యాండమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోగాపురం, గుర్ల, గుమ్మలక్ష్మీపురం, డెంకాడ, యలమంచిలి, ఆశీలమెట్ట, అక్కయ్యపాలెం, చంద్రంపాలెం, రాంబిల్లి తదితర పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ శాతం పీవో డైరీతో పోల్చి చూశారు. చివరి సమయంలో ఎక్కువగా ఓట్లు వినియోగించుకున్న పోలింగ్ కేంద్రాలు, టెండర్ ఓట్లు వివరాలు ఎన్నికల పరిశీలకులు తనిఖీ చేశారు.

అనంతరం పోటీ చేసిన అభ్యర్థులు ఓటింగ్ సరళిపై తమ అభిప్రాయాలను అబ్జర్వర్స్‌కు వివరించారు. సమావేశంలో జేసీ కె.ఎస్.విశ్వనాథన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, విజయనగరం ట్రైనీ కలెక్టర్ శ్రీఖర్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆరు జిల్లాల సహాయ రిటర్నింగ్ అధికారులు, ఆర్డీవోలు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మానసిక వైద్యశాలలో సదుపాయాలపై ఆరా



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ కేసలి లప్పారావు, గొండు సీతారాం

ఏయూక్యాంపస్ : పిల్లల హక్కులకు, వారి సంక్షేమానికి భంగం కల్గించే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం స్పష్టం చేశారు. మంగళవారం చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో 18 ఏళ్లలోపు బాలలు మానసికంగా ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కమిషన్ చైర్మన్ తెలుసుకున్నారు. వివిధ మానసిక సమస్యలతో వస్తున్న చిన్నారుల సంఖ్య, వాటికి కారణాలు, తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలలకు ప్రత్యేకించి ఒక విభాగం కేటాయించి వారికి మెరుగైన వైద్యం అందించాలని, వివిధ మానసిక వ్యాధులతో చికిత్స పొందుతున్న వారితో కలిపి ఎట్టి పరిస్థితుల్లోనూ చికిత్స అందించవద్దని ఆదేశించారు. కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ వైద్యం పొందుతున్న చిన్నారులకు అందిస్తున్న భోజనం, టిఫిన్లు నాణ్యతా ప్రమాణాలు లేవన్నారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందడం లేదని, కాంట్రాక్టర్ అరకొరగా అందిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే కాంట్రాక్టర్‌కు మెమో జారీచేయాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ, సీఎస్ఆర్ఎంవో హైమావతి విజయనగరం జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బే.. తీరిక లేదండీ..!

- ఓటు వేసేందుకు నగర పట్టభద్రుల నిర్లక్ష్యం
- నగర పరిధిలో 62.24 శాతం ఓటింగ్ నమోదు
- అల్లూరిలో 72.56 శాతం, అనకాపల్లిలో 73.80 శాతం నమోదు

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలైనా.. కార్పొరేషన్ ఎన్నికలైనా.. ఏదైనా సరే.. ఓటు వేసేందుకు మాకు తీరక ఉండదండీ.. అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు నగర ప్రజలు. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్ అయింది. ఈసారి ఓటు హక్కు వినియోగించుకోవాల్సింది పట్టభద్రులు. అందరూ చదువరులే.. అయినా ఓటు వేసేందుకు మాత్రం అదే నిర్లిప్తత కనబరిచారు. రూరల్ ప్రాంతాలైన అనకాపల్లి, అల్లూరి జిల్లాల గ్రాడ్యుయేట్స్‌తో పోలిస్తే.. విశాఖ జిల్లాలోని పట్టభద్రులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.



గత ఎన్నికల కంటే తక్కువగా..

2017లో జరిగిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలో 72 శాతం, విజయనగరంలో 70.4, విశాఖపట్నం జిల్లాలో 68.5 శాతం పోలింగ్ నమోదైంది. ఉమ్మడి విశాఖ జిల్లాగా ఉన్న సమయంలో 68.5 శాతం పోలింగ్ ఉండగా.. ఇందులో విశాఖ నగరం పరిధిలో 65 శాతం నమోదైంది. ఈ ఎన్నికల్లో చూస్తే.. కేవలం 62.24 శాతం మాత్రమే విశాఖ జిల్లా పరిధిలో నమోదైంది. విశాఖ జిల్లాలో 1,05,697 మంది ఓటర్లుండగా.. కేవలం 65,789 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన గ్రాడ్యుయేట్స్ మాత్రం మనకెందుకులే అన్నట్లుగా వ్యవహరించారు. అనకాపల్లి జిల్లాలో 73.80 శాతం, అల్లూరి జిల్లాలో 72.56 శాతం మంది గ్రాడ్యుయేట్స్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ లెక్కన చూస్తే.. నగరంలో ఉన్న పట్టభద్రుల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రాడ్యుయేట్స్ ఓటు హక్కుపై విజ్ఞతతో ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఓటు.. ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం. ప్రజలు తమ భవిష్యత్తుని.. పాలకుల్ని తామే నిర్ణయించుకునే అపురూప అవకాశం. కానీ.. ఆ ఓటు వినియోగంలో పట్టభద్రులు కూడా ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి చేటని మేధావులు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నా ఒక్కడి ఓటుతో ఏం జరుగుతుంది..?

నా ఒక్కడి ఓటుతో ఫలితాలు మారిపోతాయా.? నేను ఓటెయ్యకపోతేనేం.. చుట్టు పక్కల వారంతా ఓటు వేస్తారు కదా.. నా ఓటుతో పరిస్థితులు మెరుగవుతాయా..? ఓటెందుకు వెయ్యలేదని ఎవరైనా అడిగితే.. వచ్చే నిర్లక్ష్యపు సమాధానమిదే. తమ పేరు లేదని తప్పించుకునేవారు కొందరైతే.. ఆ రోజు సెలవు దొరికింది ఎంజాయ్ చెయ్యాలని అనుకునేవారు ఇంకొందరు. క్యూలో వెయిట్ చేయడం నా వల్ల కాదని తప్పించుకునేవారు మరికొందరు. ఇలా ఎవరికి వారు ఈ క్రతువుకి దూరమైపోతున్నారు. ఫలితంగా ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు



గాయపడిన లక్ష్మీప్రసన్న, అనూష



రవికుమార్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

తగరపువలస: కారును లారీ ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సంగివలస వద్ద జాతీయరహదారిపై మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా గార మండలం బూరవిల్లికి చెందిన మళ్ల రవికుమార్(42), మళ్ల అనూష(30), బొడ్డ లక్ష్మీప్రసన్న(38) విశాఖలో వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరారు. సంగివలస వద్ద జాతీయరహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ అదుపుతప్పి కారును ఢీకొని డివైడర్‌ను రాసుకుంటూ ఎడమవైపు రెయిలింగ్‌ను ఢీకొట్టి ముందు చక్రం ఊడటంతో ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కారు స్టీరింగ్‌కు, సీటుకు మధ్య ఇరుక్కుపోయి రక్తమోడుతున్న రవికుమార్‌ను స్థానికులు అతి కష్టంమీద బయటకు తీశారు. కారులోని ఉన్న మిగిలిన ఇద్దరు క్షతగాత్రులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ముగ్గురిని ట్రాఫిక్ పోలీసుల సాయంతో స్థానికులు సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రవికుమార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ







ఉపకరణాలతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విభిన్న ప్రతిభావంతులు

మహారాణిపేట: సామాజిక బాధ్యతలో భాగంగా విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేసినట్లు అగర్వాల్ మహాసభ విశాఖపట్నం అధ్యక్షుడు బిజయేంద్ర కుమార్ గుప్తా తెలిపారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది తొలి అంశంగా వీల్ చైర్స్, వాకర్స్, స్టిక్స్, ఊత కర్రలు పంపిణీ చేసినట్లు వివరించారు. మహారాణిపేట రాజస్థాన్ సాంస్కృతిక మండల్ భవన్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమం చైర్మన్ ప్రకాష్ సరోగి, కో–చైర్మన్ చాందమాల్ అగర్వాల్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల చరిత్ర కలిగిన అగర్వాల్ మహాసభ విశాఖ నగరంలో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలు సహా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం, గుంటూరు, హైదరాబాద్, వారణాసి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 290 మంది లబ్ధిదారులకు ఉపకరణాలు అందజేశామన్నారు. కో–ఆర్డినేటర్ సంజయ్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్, మహాసభ కార్యదర్శి దేవకి నందన్, సీనియర్ సభ్యులు ముఖేష్ బాన్సాల్, బీసీ అగర్వాల్ తదితరులు ప్రసంగించారు. పవన్ కుమార్ కన్సారియా, సంజయ్ కానొడియా, రాజేష్ అగర్వాల్, అమన్ గార్గ్, విష్ణు పచేరియ తదితరులు పాల్గొన్నారు.

జలసవ్వడి

ఈ వేసవిలోనూ నీటి ఎద్దడి లేనట్లే.!

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ఈ వేసవిలో కూడా మంచినీటి సరఫరాకు ఢోకా లేదు. ఏటా వేసవి వచ్చిందంటే చాలు మంచి నీటికి నగర ప్రజలు కిటకిటలాడేవారు. గతంలో అయితే రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా జరిగేది. టీఎస్సార్ కాంప్లెక్స్‌కు జనాలు క్యూ కట్టేవారు. వెయ్యి లీటర్ల కెపాసిటీ ట్యాంకులు కొనుగోలు చేసి మంచినీటి ఎద్దడి తీర్చుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తుండటంతో.. రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉంది. దీంతో ఈ వేసవిలోనూ నీటి ఎద్దడి లేనట్లేనని అధికారులు తెలిపారు.

ఈ నెల 14 నాటికి రిజర్వాయర్లలో నీటి మట్టాలు ఇలా..

రిజర్వాయర్	గరిష్ట నీటి మట్టం	మినిమం డ్రా డౌన్ స్థాయి (ఎండీడీఎల్)	ప్రస్తుత నీటినిల్వ
ఏలేరు	86.56 మీ.	72.54 మీ.	79.60 మీ.
గోదావరి	18.00 మీ.	10.67 మీ.	12.90 మీ.
రైవాడ	114.00 మీ.	99.00 మీ.	110.42 మీ.
మేహాద్రి గెడ్డ	61.0 అడుగులు	44.0 అడుగులు	55.6 అడుగులు
తాటిపూడి	297.0 అడుగులు	251.0అడుగులు	292.80 అడుగులు
గంభీరం గెడ్డ	126.0 అడుగులు	107.0 అడుగులు	120.0 అడుగులు
సబ్ సర్ఫేస్ వాటర్..			
గోస్తనీ నది	35.0 అడుగులు	21.6 అడుగులు	28.0 అడుగులు
ముడసర్లోవ	169.0 అడుగులు	152.0 అడుగులు	165.8 అడుగులు

భూముల రీసర్వే వేగవంతం చేయాలి



సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన సమగ్ర భూసర్వేను మరింత వేగవంతం చేయాలని సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్యతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ నిర్దేశిత గడువులోపు ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల రీసర్వే వేగవంతంగా చేయాలని కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథ్‌లను ఆదేశించారు. సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాల కొండయ్య మాట్లాడుతూ కలెక్టర్లు గ్రామాల వారీగా సమీక్షలు చేసి పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు సర్వే శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్ విశాఖ నుంచి హాజరయ్యారు. కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ విజయకుమార్ పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఆర్సీ రాష్ట్ర కార్యదర్శికి జరిమానా



అల్లిపురం: జాతీయ మానవ హక్కుల కౌన్సిల్(ఎన్‌హెచ్‌ఆర్సీ) రాష్ట్ర కార్యదర్శికి మోటారు వాహనాల చట్టం ప్రకారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. అనకాపల్లికి చెందిన ఏఆర్‌జీ శాస్త్రి అలియాస్ నల్లబాబు ఎన్‌హెచ్‌ఆర్సీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. మంగళవారం సాయంత్రం బీచ్‌రోడ్డులో తన స్కార్పియో వాహనంలో వెళ్తున్నారు. వాహనానికి ఎరుపు, నీలం రంగుల జిగ్‌జాగ్ లైట్లు, డిస్కో లైట్లు పెట్టుకుని వెళ్తుండడంతో.. ఏఎస్ బీచ్ ఆస్పత్రి వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు గమనించారు. వెంటనే వాహనాన్ని ఆపి అతన్ని ప్రశ్నించారు. డిస్కో లైట్లు పెట్టుకుని తిరగడం నేరమని చెప్పి మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానా విధించారు.

బావను చంపిన బావమరిదికి యావజ్జీవం

రూ.300 కోసం హత్య చేసిన రామ్‌నాథ్‌సింగ్

విశాఖ లీగల్ : రూ.300 కోసం క్షణికావేశంలో బావ మరణానికి కారణమైన బావమరిదికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు, రూ.2,500 జరిమానా విధిస్తూ విశాఖలోని 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావు(నంద), యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు అందించిన వివరాలు.. యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ వద్ద బీహార్ రాష్ట్రం గయ జిల్లాకు చెందిన మృతుడు శైలేష్‌సింగ్ భార్య సునీతాదేవితో కలిసి ఒక దాబా నిర్వహించేవారు. శైలేష్ బావమరిది, నిందితుడు రామ్‌నాథ్‌సింగ్ కూడా రోజువారీ కూలీగా దాబాలో పనిచేసేవాడు. శైలేష్ తన వ్యక్తిగత పూచీతో నిందితుడికి రూ.30 వేలు అప్పుగా ఇప్పించాడు. ప్రతిరోజు సాయంత్రం ఫైనాన్స్ వారికి రామ్‌నాథ్‌సింగ్ జీతం నుంచి రూ.300 కట్టేవాడు. ఈ నేపథ్యంలో 2015 ఏప్రిల్ 20న శైలేష్ రూ.300 రామ్‌నాథ్‌కి ఇచ్చాడు. అయితే రామ్‌నాథ్ ఆ డబ్బులు ఎక్కడో పెట్టడంతో కనిపించలేదు. దీంతో శైలేష్ సింగ్ భార్య సునీతాదేవితో గొడవ పెట్టుకున్నాడు. అదే రోజు రాత్రి 9.30 గంటల సమయంలో దాబా పక్కనే ఉన్న, టైర్ల షాపులోకి వెళ్లి అక్కడ మహమ్మద్ ఇస్లాం సహకారంతో బలమైన ఇనుపరాడ్డును తీసుకుని శైలేష్ తలపై దాడి చేశాడు. అనంతరం ఆ రాడ్డుతో సహా బీహార్‌కు పారిపోయాడు. వెంటనే శైలేష్ భార్య అతనిని స్థానిక ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకు విశాఖలోని కేజీహెచ్‌కి తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శైలేష్ మృతి చెందాడు. అప్పట్లో సంచలనం రేపిన ఈ కేసును అప్పటి యలమంచిలి గ్రామీణ పోలీస్ స్టేషన్ సీఐ ఎ.వెంకట్రావు దర్యాప్తు చేశారు. నిందితునిపై భారతీయ శిక్షాస్మృతి 302 కింద కేసు నమోదుచేసి చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.


ఆర్టీసీ బస్సుపై ఆకతాయిల దాడి



గాయాలపాలైన కండక్టర్, డ్రైవర్

బీచ్‌రోడ్డు: మద్యం మత్తులో కొంత మంది ఆకతాయిలు ఆర్టీసీ బస్సుపై దాడి చేశారు. ఈ ఘటనలో కండక్టర్, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద ఉన్న బస్సుపై మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో రెండు బైకులపై వచ్చిన కొంత మంది ఆకతాయిలు దాడి చేసి అద్దాలు పగలకొట్టారు. అక్కడే ఉన్న కండక్టర్ శశిభూషణరావు ఎందుకు బస్సు అద్దాలు పగలగొడుతున్నారని వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో కండక్టర్‌పై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీన్ని గమనించి అక్కడకు చేరుకున్న డ్రైవర్ లక్ష్మణరావును కూడా గాయపరిచారు. దీంతో వారు పెద్దగా కేకలు వేయగా.. మిగతా ఆర్టీసీ సిబ్బంది అక్కడకు చేరుకుని నిందితులను పట్టుకునే ప్రయత్నం చేశారు. వారిని గమనించిన ఆకతాయిలు బైక్‌లపై పరారయ్యారు. ఈ ఘటనపై విచారణ జరిపిన మూడో పట్టణ పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన కండక్టర్, డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు.

సింహగిరి కొండల్లో మంటలు



మైక్రోటవర్ మార్గంలో మంటలు

సింహాచలం: సింహగిరిపై మైక్రోటవర్‌కు వెళ్లే మార్గంలో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎండిపోయిన తుప్పలకు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. దేవస్థానం సిబ్బంది సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఎవరో కావాలనే ఎండిన తుప్పలకు నిప్పు పెట్టి ఉంటారని దేవస్థానం అధికారులు భావిస్తున్నారు.